ప్రజాశక్తి
శుక్రవారం 8 సెప్టెంబర్ 2023 5 అనంతపురం

సిబ్బంది నామమాత్రం.. పర్యవేక్షణ లోపం..!

- కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో సిబ్బంది కొరత
- కోట్లలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ప్రకటనలు
- పనుల నాణ్యతా ప్రమాణాలపై సందేహాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివద్ధి వందల కోట్లల్లో జరుగుతోందని పాలకవర్గం ప్రకటనలు గుప్పిస్తోంది. ఆచరణలో ఆ పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది కొరతకారణంగా నిర్వీర్యంగా మారిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. 12 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, ఆరుగురు డీఈలు, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఒక ఎస్ఇ ఈ విభాగంలో ఉండాలి. అయితే 6 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, ఆరుగురు డిఇలు, ఒక ఎస్ఈ మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. పర్యవేక్షణాధికారులైన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు డిఈలకే ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాధ్యతలు అప్పగించారు. దీంతో నగరంలో వందల కోట్ల రూపాయల అభివద్ధి పనులు జరుగుతున్నాయని ఘనంగా చాటుకుంటున్న పాలకవర్గం, అధికార యంత్రాంగం ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ శాఖలో సిబ్బంది కొరత కారణంగా అభివద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. పనులు నాసిరకంగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అభివద్ధి పనుల అంచనాలు రూపొందించి, టెండర్లు ఖరారు అయిన తర్వాత వాటిని పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ఇంజినీర్లు రెట్టింపు పని భారంతో సతమతం అవుతున్నారు. దీంతో ఆయా పనులకు సంబంధించిన ఫైళ్లు ముందుకు సాగేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నెలల తరబడి ఎంబుక్ మెజర్మెంట్ బుక్ తయారు చేయించుకోవడం కష్టంతరం అవుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీనికి తగ్గట్టు బదిలీ అయిన అధికారులను ఆగమేఘాల మీద రిలీవ్ చేసి పంపుతున్నారు. వారి స్థానంలో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కాకున్నా పట్టించుకోవడం లేదు. గతంలో ఏ విభాగంలోనైనా అధికారిని బదిలీ చేస్తే వారి స్థానంలో రిలీవర్ వచ్చేంతవరకు బదిలీ ఆర్డర్స్ పొందిన వారిని రిలీవ్ చేసేవారు కాదు. ప్రస్తుతం ఆ ప్రక్రియకు కార్పొరేషన్ ఉన్నతాధికారి కిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పాలకవర్గం కూడా ఈ విషయంపై జోక్యం చేసుకుని చెప్పే పరిస్థితులు కన్పించడం లేదు. కొంతకాలం క్రితం వరకు సూపరిండెంట్ ఇంజినీర్ పోస్ట్ సైతం ఇన్‌ఛార్జి పాలనలోనే కొనసాగింది. ఇక్కడ సమర్థవంతంగా పనిచేసే అధికారులు ఒత్తిళ్లు తట్టుకోలేక బదిలీలు చేయించుకుని ఇతర ప్రాంతాలకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పరిస్థితిని తెలుసుకుని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేయటానికి ఇంజినీరింగ్ అధికారులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. సమర్థులైన అధికారులను పొమ్మనలేక పొగ పెట్టి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో వందల కోట్ల అభివద్ధి పనులు ఏమేరకు నాణ్యత ప్రమాణాలతో ముందుకు సాగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నాలుగేళ్ల వైసిపి పాలనలో..

రాష్ట్రం సర్వనాశనం

- అన్ని విధాలా ప్రజలపై భారాలు
- రూ.10 ఇచ్చి రూ.100 దోచుకుంటున్నారు..!
- జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రాభివృద్ధి
- నారా చంద్రబాబు నాయుడు
- అనంతలో ముగిసిన బాబు పర్యటన

గుత్తిలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్ని టిడిపి శ్రేణులు, మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం, గుత్తి

కళ్యాణదుర్గంలో రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న చంద్రబాబు

నాలుగేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో రైతాంగం సర్వనాశనం అయ్యిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం కళ్యాణదుర్గం శ్రీనివాస కళ్యాణమండపంలో 'రైతు సంక్షోభం-ప్రజావేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో చంద్రబాబు ముఖాముఖి మాట్లాడారు. టీడీపీ పాలనలో రైతులకు అందజేసిన సబ్సీడీ పథకాలు ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలనలో రైతుల కష్టాలపై చర్చించారు. ప్రస్తుత వ్యవసాయంలో పడుతున్న ఇబ్బందులను స్థానిక రైతులు చందద్రాబాబుకు వివరించారు. గతంలో 10 ఎకరాలు ఉన్న ప్రతిరైతుకూ 90శాతం సబ్సీడీతో బిందు, తుంపర సేద్యం పరికరాలు విరివిగా అందాయని, ప్రస్తుతం ఇలాంటి పథకాలు లేవన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రతి ఏడాదీ పంటనష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్‌సబ్సీడీ, ఇన్సూరెన్స్ తూచా తప్పకుండా అందేదన్నారు. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా అతివృష్టి, అనావృష్టి కారణంగా తాము సాగుచేసిన వేరుశనగ, కంది, టమోటా, మామిడి, బొప్పాయి, మిరప తదితర పంటలకు పరిహారం అందలేదని రైతులు చంద్రబాబు ఎదుటే ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన సాగులో ఏఒక్కస్కీం కూడా లేకుండా చేశారని ఆక్రోశాన్ని వెల్లగక్కారు. ప్రస్తుత పాలనతో సంక్షేమ పథకాల ఊసే లేదని ఎర్రంపల్లి, పాలవాయి, ముద్దినాయనపల్లి, ముదిగల్లు, ఒంటిమిద్ది, ముప్పలకుంట తదితర గ్రామాల రైతులు వాపోయారు. అనంతపురం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్నప్పటికీ ఈ ప్రాంత రైతులు, ప్రజలను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికైనా రైతులు మేల్కొని దుర్మార్గపు పాలనను సాగనంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడుతో పాటు రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపద సష్టించి.. ఆదాయాన్ని పెంచుతాం

గుత్తి : రాష్ట్రంలో సంపదను సష్టించి ఆదాయాన్ని పెంచి ప్రజలకు పంచుతామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం గుత్తికి వచ్చారు. ముందుగా పట్టణ శివారులో అసంతప్తిగా నిలిచిపోయిన మిడ్ పెన్నార్ తాగునీటి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. అక్కడ చంద్రబాబు సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రజలే నాకు బలం ప్రజలే నా సైన్యం అన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో సైకో పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువులు, పెట్రో విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది అన్నారు. ప్రజలకి జగన్ రూ.10 ఇచ్చి రూ.100 దోచుకుంటున్నాడని ఆరోపించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతానన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.69 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. అరాచక ప్రభుత్వం ఎంతో చరిత్ర గల గుత్తి చెరువుకు సాగునీరు అందించలేకపోతుందన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు, ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తామన్నారు. గుత్తి మున్సిపాలిటీలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.173 కోట్లతో తాము మిడ్ పెన్నార్ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తే మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లు గడిచినా పూర్తి చేయలేక పోయిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి ఇంటికీ తాగునీటిని ఉచితంగా అందిస్తామన్నారు. తమ హయాంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే వారమన్నారు. అదనంగా విద్యుత్తును ఉత్పత్తి చేసి వినియోగాన్ని పెంచే వారమన్నారు. తాము ఐటి ఉద్యోగం ఇస్తే జగన్ వాలంటరీ ఉద్యోగం ఇచ్చాడని ఎద్దేవా చేశారు. రైతును రాజు చేసే బాధ్యత తమపై ఉందన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే సోదరులుచ బంధువులు ఆరు మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఉన్నారని వారందరూ దోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. బేడ బుడగ జంగాల సామాజిక వర్గయులకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సైకో జగన్‌ని ఇంటికి పంపి టిడిపికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.జితేంద్ర గౌడ్, ప్రభాకర్ చౌదరి, జెసి.ప్రభాకర్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటశివుడు యాదవ్, జీవానంద రెడ్డి, కేసీ.హరి, మండల, పట్టణ కన్వీనర్లు బర్దీవలి, రవిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతిప్పకొండలో బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అక్రమ మట్టి తవ్వకాలకు కేంద్రంగా మారిన అడ్డతిప్ప కొండలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 'అడ్డతిప్ప కొండలో ఆగని దోపిడీ' అన్న శీర్షికన గురువారం నాడు ప్రజాశక్తిలో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన తహాశీల్దార్ రమాదేవి కొండ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. కొండ ప్రాంతంలో అనుమతి లేనిచోట తవ్వకాలు జరిపితే బండ్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ బుక్కరాయ సముద్రం గ్రామ పరిధిలోని అడ్డతిప్పకొండ, పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడ్డతిప్ప కొండ వద్ద బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

విడపనకల్ మండల పరిధిలోని కరకముక్కల, చీకలగురికి తదితర గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదును ఉరవకొండ డివిజన్ ఏడీఏ పద్మజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంట పొలాలను పరిశీలించి, ఏ పంట ఎన్ని ఎకరాల్లో సాగు చేశారన్న వివరాలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా దాదాపు 17,673 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని, ఇప్పటివరకు కేవలం 5676 ఎకరాలు మాత్రమే ఈ క్రాఫ్ నమోదు చేశారన్నారు. పంట నమోదుకు ఈనెల 15వ తేదీన గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు ఏవో పెన్నయ్య, వ్యవసాయ అధికారులు లక్ష్మణ్, సురేఖ, ప్రకత వ్యవసాయ సిబ్బంది రవి, రైతులు మహానంది, మర్రిస్వామి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నాడు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కార్మికులకు వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు మధు, నాగేంద్ర, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-యాడికి

యాడికి, కొట్టాలపల్లి గ్రామాల్లో శ్రీ కష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోన ఉప్పలపాడు గ్రామంలో యంపలాకు బాల గంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో చెక్క భజన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ అంబటి గురు ప్రసాద్ రెడ్డి దంపతులు, ఎంపీపీ ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు దంపతులు, వైసిపి జిల్లా కార్యదర్శి పైలా నరసింహయ్య, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎన్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు

రూ.14.18 లక్షల విలువైన ఎరువుల అమ్మకం నిలుపుదల

ప్రజాశక్తి-అనంతపురం

ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో గల ఎన్ఆర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి, మండల వ్యవసాయ అధికారి జె.శశికళ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్ఆర్ ఫర్టిలైజర్ దుకాణంలో రైతులకు అమ్ముతున్న ఉత్పత్తుల స్టాక్ రిజిస్టర్లు, ఇన్ క్లూజిన్స్, స్టాక్‌ను పరిశీలించారు. వ్యవసాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా రూ.14.18 లక్షల విలువైన ఎరువులకు 'ఓ "ఫారం లేనందున వాటి అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు ఏడీఏ రవి తెలిపారు. ఎరువులు, పురుగు మందుల డీలర్లు ఎవరైనా అనుమతులు లేనివాటిని విక్రయిస్తుంటే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాచానపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని పొలాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని అనంతపురం వ్యవసాయ ఏడీఏ ఎం.రవి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంట సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఏడీఏ వెంట అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారులు మురళి, ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

చంద్రబాబుతో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

చంద్రబాబును కలిసిన జెసి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మూడు రోజుల అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా మూడవరోజు గురువారం సాయంత్రం గుత్తికి వెళుతుండగా పెద్దవడుగూరు మండలంలోని కాసేపల్లి టోల్ ప్లాజా వద్ద తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చంద్రబాబును కలిశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆయన ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు వాహనం దిగొచ్చి జెసి ప్రభాకర్‌రెడ్డితో ఆప్యాయంగా పలకరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు శాలువా కప్పి జెసి సత్కరించారు. స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ శ్రేణులకు చంద్రబాబు నాడు కతజ్ఞతలు తెలిపారు. అక్కడ నుంచి బయలుదేరి చంద్రబాబు గుత్తికి వెళ్లారు.

టిటిడి సభ్యుడు అశ్వర్థనాయక్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) పాలక మండలి సభ్యునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సి.అశ్వర్థ నాయక్‌కు గురువారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో నగరంలోని ఆయన నివాసంలో సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రే నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, బాబునాయక్, తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశ్వర్థనాయక్ మాట్లాడుతూ టిటిడి సభ్యునిగా ఎన్నిక కావడం, నా తల్లిదండ్రులు, నేను బంజారా జాతిలో పుట్టడం పూర్వ జన్మ సుకతంగా భావిస్తున్నట్లు తెలిపారు. బంజారా జాతికి నిరంతరం అండగా ఉంటానని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సంఘ్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినాయక్, ధర్మసింఘ్‌నాయక్, ఆర్జే నాయక్, నరేశ్‌నాయక్, సుగుణబాయి, శివమ్మ, సుశీలబాయి, గోవిందునాయక్, దాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత



ఆర్థిక సాయం చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 1.7లక్షల చెక్కును గురువారం నగరంలోని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి నివాసంలో సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షురాలు లలితమ్మకు అందజేశారు. మూడేళ్ల క్రితం లలితమ్మ అనారోగ్యంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేరగా వైద్యం ఖర్చులు రూ. 7 లక్షలయ్యాయి. లలితమ్మ అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షురాలిగా సేవలందించారు. ఆమె ఆర్థిక పరిస్థితిపై ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేయగా స్పందించిన ఎమ్మెల్యే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 1.7 లక్షలు మంజూరు చేయించాలరు. దీంతో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ట్రెజరర్ గోపాల్ అభినందలు తెలిపారు.

అనంతలో చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుకు అనంతపురం నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి గురువారం నగరంలోని తపోవనం సర్కిల్‌లో ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో భాగంగా క్రేన్‌తో భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గుత్తి పర్యటనకు వెళ్తున్న చంద్రబాబుకు నగరంలోని తపోవనం సర్కిల్‌లో అర్బన్ టిడిపి శ్రేణులతో కలిసి ప్రభాకర్‌చౌదరి స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబుతో కలిసి ఆయన వాహనంలో బయల్దేరి వెళ్లి ఇస్కాన్ టెంపుల్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం, గుత్తి బహిరంగ సభకు బయల్దేరి వెళ్లారు.

300 వాహనాలతో గుత్తి సభకు అర్బన్ టిడిపి శ్రేణులు

గుత్తిలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో అర్బన్ టిడిపి శ్రేణులు 300 వాహనాలతో భారీగా చంద్రబాబు కాన్వాయ్‌ని అనుసరించి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, మార్కెట్ మహేష్, గుర్రం నాగభూషణ, ముక్తియార్, గోపాల్‌గౌడ్, బోయపాటి బాలప్ప, రాజారావు, రఫీ, జెఎం బాషా, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, స్వప్న, సంగా తేజస్విని, జానకి, సరళ, కృష్ణవేణి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, మణెమ్మ, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, మాజీ కార్పొరేటర్లు వాహనాల్లో తరలివెళ్లారు.

ప్రభాకర్ చౌదరితో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీలో పని చేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో కార్మికుల సమస్యలు, భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించారు. అనంతరం కార్మికులతో కలిసి కమిషనర్ దివాకర్‌రెడ్డిని, చైర్‌పర్సన్ పొరాలు శిల్పను కలిసి సమస్యలపై చర్చించారు. 12 ఏళ్ల నుంచి పనిముట్లు, యూనిఫామ్, సబ్బులు, చెప్పులు ఇవ్వలేదన్నారు. పని భారం పెరిగిందని, పట్టణ జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్యను తక్షణమే పెంచాలని, రెగ్యులర్ కార్మికులకు సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభించాలని కోరారు. కార్యాలయ విధుల నుంచి విముక్తి కల్పించాలని, క్లాప్ ఆటోలకు ప్రత్యేక డ్రైవర్లను నియమించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్, చైర్‌పర్సన్ ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, బసవరాజు, నాగరాజు, తిప్పేరుద్ర, వన్నూరుస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాలు శిల్పతో చర్చిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సహకార సొసైటీలను అభివృద్ధి చేయాలి

ఎడిసిసి బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

సహకార సొసైటీల అభివృద్ధికి పాలక వర్గాలు కృషి చేయాలని ఎడిసిసి బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఎడిసిసి బ్యాంక్ సమావేశ హాలులో గురువారం నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పిఎసిఎస్) ఛైర్మన్లు, సిఇఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్వ, లిఖితతో పాటు ఎడిసిసి బ్యాంక్ సిఇఒ రామప్రసాద్, డిజిఎం సునీత, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ గతంలో కొందరు పాలకుల నిర్లక్ష్యం వల్ల విడపనకల్లు, కూడేరు సొసైటీలు నష్టాల్లోకి వెళ్లాయని, వాటిని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు పాలక వర్గాలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. అన్ని సొసైటీల అభివృద్ధి, లాభాల్లోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు విరివిరిగా పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలతో పాటు సొసైటీల ఆధ్వర్యం లో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల వ్యవసాయ అవసరాలకు వాణిజ్య బ్యాంకులతో పోటీ పడి రుణాలివ్వాలన్నారు. బంగారు తాకట్టు పెట్టుకుని రుణాలు ఇవ్వాలన్నారు. పెట్రోల్, డీజిల్ బంకుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, వాటిని ఏర్పాటు చేసుకుని ఆదాయ మార్గాలు పెంచుకోవాలన్నారు. రైతు మిత్ర గ్రూపులు, కౌలు రైతులు, డ్వాక్రా గ్రూపులకు రుణాలు ఇప్పించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పిఎసిఎస్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పిఎసిఎస్ ఛైర్మన్లు తేజోనాథ్, శ్రీరాములు, శివలింగప్ప, వడ్ల షేక్షావలి, సుధీర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీనివాసులు, గంగాధర్, గోపాల్‌రెడ్డి, సొసైటీల సిఇఒలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సహకార సొసైటీల పాలక వర్గాల సభ్యులతో సమీక్ష నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఎమ్మెల్యే విశ్వ

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-శింగనమల

పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. మండల పరిధిలోని చిల్లేపల్లి, కొరివిపల్లి, జులాకాల్వ, పి.జలాలపురం గ్రామాల్లో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించే బుక్ లెట్‌లు పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ముందు కెళ్తోందన్నారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నాయని వాటిని తిప్పి కొట్టాలన్నారు. కొరివిపల్లి గ్రామంలో జగన్ పాలనలో డి.పద్మావతి కుటుంబానికి రూ. 5,71,055 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, రానున్న ఎన్నికల్లో మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎఇ అన్వేష్‌కుమార్, విద్యుత్ ఎఇ విజయ్‌కుమార్, ఎంపిపి యోగేశ్వరి, డిసిఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైసిపి నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, శ్రీనివాసురెడ్డి, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'గడప గడపకూ' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి, సాంబశివారెడ్డి

చేతనైతే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకో..?

కాపు రామచంద్రారెడ్డికి కాలవ సవాల్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం వైసిపి అభ్యర్థిగా కాపు రామచంద్రారెడ్డి పేరును సిఎం జగన్ ద్వారా ప్రకటించుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మా నాయకుడు చంద్రబాబు రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించారని, చేతనైతే వారి అధినేత ద్వారా వైసిపి అభ్యర్థిగా కాపు పేరును ప్రకటింపజేయాలన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాతో అవినీతికి పాల్పడుతున్నారని, వేదవతి నదిని ఖాళీ చేశారని ఆరోపించారు. కాపు అభ్యర్థి అయితే 50 వేల మెజారిటీతో గెలుస్తానని కాలవ ధీమా వ్యక్తం చేశారు. కాపుకి ఈసారి టికెట్ రాదని ఆ పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నారని, దీనిపై వారం లోపు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు ఐదేళ్ల తర్వాత వచ్చినా రాయదుర్గం ప్రజలు నీరాజనం పట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చారిత్రక అవసరమని ప్రజలు చాటారని, ఇది టిడిపి విజయానికి సంకేతం అన్నారు. సమావేశంలో నాయకులు హనుమంతు, ఉస్మాన్, గిరి మల్లప్ప, సన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఆశా వర్కర్లకు నియామక పత్రాలు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో నూతనంగా ఎంపికైన ఇద్దరు ఆశా వర్కర్లకు గురువారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాల్తూరు వైసిపి నాయకులు రాజశేఖర్, షణ్ముక్‌గౌడ్, శివ, డిష్ వెంకటేష్, నల్ల సుంకన్న, పి.గంగన్న, పొట్టి సుంకన్న ఆధ్వర్యంలో నూతన ఆశా వర్కర్లు భీమక్క, సునితమ్మ, ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా నియమించబడిన లక్ష్మీ, తదితరులు విశ్వని కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. విశ్వ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు.

8న 'స్పందన'

బుక్కరాయసముద్రం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ మండల స్థాయి 'స్పందన' నిర్వహిస్తున్నట్లు గురువారం తహశీల్దార్ రమాదేవి తెలిపారు. అందులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, ఆర్‌డిఒ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల అధికారులందరూ తప్పక హాజరవ్వాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని సూచించారు.

వ్యాయామం తప్పనిసరి

నేడు అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

మనిషికి ఆహారంతో పాటు వ్యాయామం తప్పనిసరి అని కిమ్స్ సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీలత తెలిపారు. 'సెప్టెంబర్ 8' అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఆమె పలు విషయాలు వెల్లడించారు. రోగులు, క్రీడాకారులు, అథ్లెట్ల రోజువారీ జీవితంలో ఫిజియోథెరపిస్టులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. మానవ శరీరంలో ఏదైనా చికిత్స జరిగినప్పుడు ఆయా నొప్పులు తగ్గించడా నికి, కదికలను యథావిధిగా చేయడానికి ఫిజియోథెరపీ సాయం అవసరమన్నారు. దీర్ఘకాలిక మందుల వాడకాన్ని తగ్గించడానికి సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఫిజియోథెరపీ అనేది అస్థిరత, కండరాల బలహీనత, న్యూరోలాజికల్ బలహీనతలు, శారీరక రుగ్మతలకు సంబంధించింది అన్నారు. రోగులు త్వరగా కోలుకోవడానికి ఫిజియోథెరపిస్టులు వివిధ రకాలైన వ్యాయామాలు సూచిస్తారన్నారు. గాయాలు మానడానికి దానీ తీవ్రత మీద ఆధారపడి ఉంటుందన్నారు.

కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీలత

అన్నపూర్ణకు డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప, భాగ్యమ్మ దంపతుల కుమార్తె అన్నపూర్ణ గురువారం శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో స్టాటిస్టిక్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ పి.మహమ్మద్ అక్తర్ పర్యవేక్షణలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రాబబిలిటీ ఆఫ్ యాక్సెప్టెన్సీ బేస్డ్ ఆన్ ప్రిచెట్ అండ్ జనరలైజ్డ్ రేలేహ్ డిస్ట్రిబ్యూషన్స్' అంశంపై పరిశోధనలు చేశారు. అలాగే పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఈమె వ్యాసాలు ప్రచురితమవడంతో అన్నపూర్ణను ప్రొఫెసర్ పి.మహ మ్మద్ అక్తర్, ప్రొఫెసర్ కె.పుష్పాంజలి అభినందించారు. అన్నపూర్ణ డాక్టరేట్ అందుకోవడం పట్ల ఆమె తల్లిదండ్రులతో పాటు సోదరులు శివ, కిరణ్, తాత రామప్ప హర్షం వ్యక్తం చేశారు.

అన్నపూర్ణ

బండి కిష్టప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి తలారి రంగయ్య

బండి కిష్టప్పకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప జన్మదినం సందర్భంగా గురువారం ఎంపి తలారి రంగయ్య కిష్టప్ప నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన బండి కిష్టప్ప మరింత మందికి సాయం చేసేలా ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. బండి కిష్టప్ప పుట్టినరోజును భార్య సరస్వతి, కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య జరుపుకొన్నారు. వాల్మీకి సంక్షేమ సేవా సమితి కార్యదర్శి ఎన్‌టి సిద్ధప్ప మాట్లాడుతూ బండి కిష్టప్ప ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకు న్నారన్నారు. కార్యక్రమంలో మలకన్న, పైతోట సంజీవ, బండి హరీష్, నరేంద్ర, కమలాక్షుడు, ప్రకాష్, రాయుడు, ముత్తప్ప, తిప్పేస్వామి, పైగిరి హమాలీ యూనియన్ అధ్యక్షులు గురుమాల్ శ్రీనివాసులు, పురుషోత్తం, గొల్ల గోపాల్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ రక్షణకు బీమా అవసరం

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబ రక్షణ కోసం జీవిత బీమా పాలసీ తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తహశీల్దార్ మారుతి పేర్కొన్నారు. పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో గురువారం నిర్వహించిన బీమా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి తహశీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు పెద్ద దిక్కు అయిన జీవిత బీమా సంస్థ నిధి సేకరణలో దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో మొట్టమొదటి స్థానంలో జీవిత బీమా సంస్థ ఒకటి అన్నారు. జీవిత బీమా ఆవశ్యకతపై సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మల్లికా ర్జునయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథ్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రవి కుమార్, శ్రీనివాసులు, ఆఫీసర్లు ప్రమీల, రోజావతి, పద్మావతి, ఎల్ఐసి యూనియన్ లీడర్లు ఆదినారాయణరెడ్డి, రవీంద్ర, గంగాధర, సత్యనారాయణ, ఎల్ఐసి ఏజెంట్ల లీడర్లు ఎం.రామాంజనేయులు, బ్రహ్మానంద, మల్లారెడ్డి, మల్లికార్జున, జలంధర్ ఆచారి, ఏజెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కెవి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తెనగల్లు గ్రామం జగనన్న కాలనీలో నూతన భవన నిర్మాణాలకు గురువారం మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాలమైన ప్రదేశంలో ప్రభుత్వం దళితులకు 2 సెంట్ల చొప్పున భూమి కేటా యించి ఇళ్లు కట్టుకునేలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఒక్కో గృహానికి రూ. 1.8 లక్షల చొప్పున 120 ఇళ్లకు నిధులు మంజూరు చేసిందని, బోరు సదుపాయం కూడా కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచి వరలక్ష్మి వెంక టేశులు, ఎంపిటిసి మమత, సచివాలయ మండల కన్వీనర్ రాము, సింగిల్‌విండో ఛైర్మన్ ఎఆర్ వన్నూరురెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లింగప్ప, జెఎసి కన్వీనర్ శ్రీనివాసులు, దివాకర్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నగర మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. అంతర్జాతీ య నీలి ఆకాశం కోసం స్వచ్ఛమైన గాలి దినోత్సవం పురస్కరించుకుని గురువారం నగరంలోని సెంట్రల్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కిషోర్‌రెడ్డి, ఎస్ఇ నాగమోహన్, తదితరులు పాల్గొని మొక్క లు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ధూళి, పొగ లేని స్వచ్ఛమైన గాలి మనిషికి ఎంతో అవసర మన్నారు. గాలి, నీటి వనరులు కలుషితం కావడం వల్ల ఊపిరితిత్తులు, గుండె జబ్బులు పెరుగుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కుమారమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

ఓటరుగా నమోదు చేయించండి

జనసేన పార్టీ అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు వారి వారి పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అనంతపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి వరుణ్ సూచించారు. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నగర, జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఓటుకు సమాజం తలరాతను మార్చే శక్తి ఉందన్నారు. అలాంటి ఓటును నిజాయితీ, నిబద్ధత కలిగిన పవన్‌కళ్యాణ్ పార్టీకి వేద్దాం.. జనసేనను గెలిపిద్దాం అని పిలుపునిచ్చా రు. యువతతో పాటు వివిధ రంగాల ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న సానుకూల వైఖరిని ఓటుగా మార్చే బాధ్యతను ప్రతి జన సైనికుడూ తీసుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యంగా ఐకమత్యంతో ముందుకెళ్దాం అన్నారు. మొదటి ఓటు జనసేనకే అనే నినాదంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. నగర, జిల్లా నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, కార్యవర్గ సభ్యులకు ఆయన దిశా నిర్దేశం చేశారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న టిసి వరుణ్

నిజాయితీ చాటుకున్న కోర్టు ఉద్యోగిని

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా కోర్టులో స్టెనోగా పనిచేస్తున్న హేమలతకు గురువారం ఉదయం శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన్ ద్వారా వెంకటేశ్వరస్వామి దర్శనార్థం వెళ్తుండగా క్యూలైన్‌లో 2.5 తులాల బంగారు చైన్ దొరికింది. దీంతో ఆమె తన భర్త(పాత్రికేయులు) తలారి రామాంజనేయులుతో కలిసి సెక్యూరిటీ సిబ్బందికి ఆ చైన్‌ను అప్పగించారు. సెక్యూరిటీ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా చైన్ పోగొట్టుకున్న తమిళనాడు భక్తులను గుర్తించి పోలీసుల సమక్షంలో హేమలత దంపతుల ద్వారానే వారికి అప్పగించారు. నిజాయితీగా చైన్ ఇచ్చిన హేమలత దంపతులను బాధితురాలు, సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు అభినందించారు.

లోకేష్ పాదయాత్రపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి-శింగనమల

పశ్చిమ గోదావరి జిల్లాలో యువగళం పాదయాత్రలో పాల్గొన్న వాలంటీర్లు, టిడిపి కార్యకర్తలపై వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం దుర్మార్గమైన చర్యని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి గురువా రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్రకు వైసిపి నాయకులు, పేటియం బ్యాచ్ ఎన్ని ఆటంకాలు సృష్టించి నా నారా లోకేష్ వాటిని అధిగమించి దిగ్విజయంగా ముందుకుసాగుతున్నారన్నారు. ఇది ఓర్వలేని వైసిపి పేటీఎం బ్యాచ్ దాడులకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు దాడి చేసిన వారిని వదిలిపెట్టి పాదయాత్ర వాలంటీర్లపై కేసు నమోదు చేసి వైసిపి నాయకుల గొడౌన్స్‌లో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నారా లోకేష్‌తో పాటు అక్కడి టిడిపి అగ్ర నాయకులకు నోటీసులు పంపడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల్లో వైసిపికి ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

బొమ్మనహాల్ : టిడిపి అధినేత చంద్రబాబు రాయదుర్గం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు పేరును ప్రకటించడం పట్ల ఆ పార్టీ మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం తెలుగు తమ్ముళ్లు టిడిపి జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

8న ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

శింగనమల : శ్రావణమాసంలో చివరి శనివారం సందర్భంగా మరువకొమ్మ క్రాస్ వద్ద వెలసిన పురాతన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 8వ తేదీ ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి శింగనమల మత్స్యకార సంఘం సభ్యులు రూ. 10వేలు విరాళం అందజేశారు. భక్తులు విరాళాలు ఇవ్వవచ్చని తెలిపారు.

క్రీడా పోటీల నిర్వహణపై సమావేశం

గార్లదిన్నె : 2023-24 విద్యా సంవత్సరంలో అండర్-14, 17 విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిం చడంపై గురువారం ఎంఇఒ ఆధ్వర్యంలో స్థానిక జడ్పి హైస్కూల్‌లో పిఇటి, పిడిలతో సమావేశం నిర్వహించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో స్థానిక జడ్పి హైస్కూల్ క్రీడా మైదానంలో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 85230 14164 నెంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయునికి సన్మానం

గార్లదిన్నె : మండల పరిధిలోని ఇల్లూరు జడ్పి హైస్కూల్‌లో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గురుస్వామి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు తీసుకున్నారు. దీంతో గురువారం పాఠశాలలో హెచ్‌ఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో గురుస్వామిని తోటి ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుస్వామిని సత్కరిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పకడ్బందీగా 'ఆరోగ్య సురక్ష'

నార్పల : ఈ నెల 15 నుంచి 30 తేదీ వరకు చేపడుతున్న ఆరోగ్య సురక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపిడిఒ దివాకర్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మండల వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, సిహెచ్ఒ బాలాజీ, ఎంపిహెచ్ఒ మల్లికార్జునతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారున. వైద్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారికి అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై నేడు శిక్షణ

శింగనమల : బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం(నేడు) స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని జిల్లా ఛైల్డ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి తెలిపారు. శింగనమలలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ బాల్య వివాహాలు, నిర్మూలన, అధికారాలు, విధులు, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపిడిఒ, తహశీల్దార్, వైద్యాధికారి, ఎంఇఒ, పోలీస్ స్టేషన్ అధికారులు, మహిళా పోలీసులు, విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు హాజరవుతారన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

అనంతపురం : టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి బట్టా బుగ్గయ్యచౌదరి జన్మదినం సందర్భంగా గురువారం నగరంలోని సర్వజన ప్రభుత్వాసుపత్రిలో 500 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళీధర్, వైస్ ఛైర్మన్ పి.కృష్ణకుమార్, నాయకులు జలది మదన్మోహన్, ఇస్మాయిల్, నగర బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు మార్కెట్ శ్రీధర్, అనిల్, సునీల్, ఆకుల యాదవ్, అబ్దుల్, గంగాద్రి, మహిళా నాయకురాలు లక్ష్మీనాయుడమ్మ, చల్లా ఉమ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు, సింగనగుంటపల్లి, తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపప్పూరులో ఉదయాన్నే స్వామివారికి అభిషేకం చేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీకృష్ణుని విగ్రహాన్ని రథంలో ఉంచి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సింగనగుంటపల్లి గ్రామంలో రాత్రి సర్పంచి గంగమ్మరాజు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, పలకల భజన నిర్వహించారు.

జనాభా అధికం.. అభివృద్ధి నామమాత్రం

తాడిపత్రిలో ఓటుబ్యాంకుగానే ముస్లిములు
విద్యావకాశాలకు దూరంగా యువత
రాజకీయంగా, ఆర్థికంగా గుర్తింపులేదనే భావన

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పురపాలక సంఘం పరిధిలోని ముస్లింలు అధికంగా ఉన్నారు. అభివృద్ధిలో మాత్రం వీరు నామమాత్రంగానే ఉన్నారు. యువతకు ఉన్నత విద్య అభ్యసించడానికి సరైన మౌలిక వసతులు లేక వారు రోజువారి కూలీలుగా మారుతున్నారు. తాడిపత్రి మున్సిపాల్టీలో 36 వార్డులకు గాను 20 మంది ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారు ఇటీవల పురపాలక సంఘం ఎన్నికల్లో పోటీ చేశారు. వీరిలో 13 మంది గెలుపొందారు. వీరితో పాటు మరో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులుగా మున్సిపాల్టీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పట్టణంలోని 88 వేల ఓట్లకు గాను దాదాపు 23 వేల ఓట్లు ముస్లింలవే ఉన్నాయి. జనాభా అధికంగా ఉన్న వీరు అభివృద్ధిలో మాత్రం ఇంకా కిందనే ఉన్నట్లు తెలుస్తోంది. తాడిపత్రిలో మైనార్టీల్లో ఉన్నత విద్యను అభ్యసించిన వారి సంఖ్య చాలా తక్కువగానే ఉంది. చాలా మంది చిరుద్యోగులు, రోజువారి కార్మికులు, షాపులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గుజిరీ, పెయింటింగ్, తోపుడు బండ్లు, వెల్డింగ్, మెకానిక్, గహ నిర్మాణ పనులను చేస్తూ జీవిస్తున్నారు. బీసీ ఈ క్యాటగిరిలో ఉన్న వారికి విద్యా, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అయితే వీరికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఇప్పటికీ వారి జీవనం సాధారణంగానే గడుస్తోంది. ముస్లిముల శ్మశాన వాటికకు రోడ్లు వేడయం.. మసీదులకు ప్రహరీలు నిర్మించడమే అభివృద్ధి అన్నట్లు పాలకులు చెప్పడంపై ముస్లిములు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రిలో అక్షరం ముక్క రాని ముస్లిములు వేలల్లోనే ఉన్నారంటే ఇక్కడ వారి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది మహిళలు బీడీ కార్మికులుగా మగ్గిపోతున్నారు.

తాడిపత్రి పట్టణంలో పెద్ద స్థాయిలో ముస్లింలు ఉన్నా అభివద్ధి చెందక పోవడానికి నాయకత్వ లోపమే ప్రధాన కారణం అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్ని పార్టీల్లోనూ కోట్లకు పడగలెత్తిన ముస్లిం రాజకీయ నాయకులు ఉన్నారు. వీరు నాయకులుగా చెలామణి అవుతున్నారు తప్పా ముస్లింల అభివృద్ధి కి పాటుపడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 2019 ఎన్నికల అనంతరం అధికా ర పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు రాజకీయాలకు దూరంగా ఉండడంతో ముస్లిం మైనార్టీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైనట్లు తెలుస్తోంది. ముస్లిం మైనార్టీ నేత ఫయాజ్ బాషా ట్రస్ట్‌ను నెలకొల్పి ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో 1 నుంచి 4 వార్డుల్లో ముస్లిం ఓటర్లను ఈయన ప్రభావితం చేయగలిగిన శక్తి ఉంది. అయితే ఫయాజ్ బాషా నాయకత్వంపై కూడా ముస్లిముల్లో భిన్నవాదనలు విన్పిస్తున్నాయి. ముస్లింల ఆర్థికాభివద్ధికి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందేలా ఆయన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శ ఉంది. రమేష్ రెడ్డి, కాకర్ల రంగనాథ్‌ల వెంట నడిచే ముస్లింలు బరిలో ఉన్న ఏ నాయకుడివైపు మొగ్గితే అటువైపే ఓట్లు గుమ్మరించగలరు. ఇలాంటి పరిస్థితుల్లో మైనార్టీ నాయకులు వారి స్వప్రయోజనాలు మాని ముస్లిం ఐక్యత, సఖ్యత కోసం పాటుపడాలని పట్టణ ముస్లింలు కోరుతున్నారు.

తాడిపత్రిలో టూవీలర్ పెయింటర్‌గా పనిచేస్తున్న గౌస్

ఆర్థిక ఇబ్బందులతో చదువుమానేశా..

ఆర్థిక ఇబ్బందులతో పదవ తరగతిని మధ్యలో వదిలేశాను. చిన్ననాటి నుంచే దిన కూలీగా చేరాను. ఎనిమిది సంవత్సరాలుగా టూవీలర్ పెయింటర్‌గా పని చేస్తున్నాను. పిల్లలు ఉన్నత విద్య చదివించాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంటి అద్దెలు కరెంట్ బిల్లులు నిత్యావసర సరుకుల ఖర్చులు పెరిగాయి. నాకు వచ్చే సంపాదన కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు.

గౌస్, టూవీలర్ మెకానిక్ పెయింటర్, తాడిపత్రి